క్లుప్తంగా

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ



శక్తి యాప్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం: మహిళలు అత్యవసర పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ అభివృద్ధి చేసిన శక్తి మొబైల్ యాప్ ద్వారా తక్షణ సహాయం పొందవచ్చని మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ అహ్మదున్నీషా అన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిల్లో శక్తి మొబైల్ యాప్ వినియోగం, మహిళా సంబంధిత నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అత్యవసర పరిస్థితిలో బటన్ నొక్కితే, కొన్ని నిమిషాల వ్యవధిలోనే పోలీసు బృందాలు మీ వద్దకు వచ్చి మీకు సహాయం అందజేస్తారన్నారు.

100 గ్రాముల వెండి అందజేత



అమ్మవారికి వెండి అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలా త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి దాతలు 100 గ్రాముల వెండిని విరాళాలు అందించారు. మంగళవారం భీమవరం మెంటేవారి తోటకు చెందిన ఏలూరి శ్రీనివాస్, కల్యాణి దంపతులు 100 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. ఆలయ అర్చకులు పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. వెండి పీఠానికి దాతలందిస్తున్న సహకారానికి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సూర్య ఘర్ యోజన పథకం అమలుపై సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో సోలార్ ప్యానల్ యూనిట్లు రిజిస్ట్రేషన్, స్థాపన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం అమలులో భాగంగా సోలార్ ప్యానెల్ యూనిట్ల రిజిస్ట్రేషన్, స్థాపన ప్రగతిని మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఈ పథకం అమలు మందకొడిగా సాగడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం విస్తృత స్థాయిలో అమలు చేయడానికి రాష్ట్రంలోనే అనువుగా ఉన్న ఏకైక జిల్లా పశ్చిమగోదావరి జిల్లా అన్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న జిల్లాలోనే ఈ పథకాన్ని అమలు చేయలేకపోతే రాష్ట్రంలో ఎక్కడ పెద్ద స్థాయిలో అమలు చేయలేరన్నారు. ఈ గూగుల్ మీట్ లో జిల్లా విద్యుత్ శాఖాధికారి ఏ.రఘునాథ్ బాబు, డిఇలు, ఏఇలు, బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మార్టేరు - పెనుగొండ రోడ్డులో రాకపోకలు ప్రారంభం



కంకర గుట్టలు తొలగించడంతో తిరుగుతున్న వాహనాలు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం నెగిపూడి వద్ద నర్సాపురం కాలువ నుంచి పంట బోదెకు రూ.59 లక్షలతో కల్వర్టు నిర్మించేందుకు నెల రోజుల క్రితం ఆర్ అండ్ బీ అధికారులు రోడ్లు మూసివేశారు. దీంతో నెల రోజులుగా ఆ రహదారిని వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే మంగళవారం సాయంత్రం కల్వర్టు వద్ద రోడ్డుకు అడ్డంగా వేసిన రాళ్ల గుట్టలను తొలగించడంతో వాహనాలు రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. అయితే ఆర్టీసీ అధికారులకు ఎటువంటి అధికారిక ప్రకటన ఇవ్వకపోవడంతో ఆర్టీసీ బస్సులు మాత్రం ఆలమూరు, ఆచంట మీదుగా నడుపుతున్నారు.

సచివాలయం ప్రారంభం

కాళ్ల: మండలంలోని కోపల్లె గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణంరాజు ప్రారంభించారు. కోపల్లెలో సుమారు రూ.40లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని, కాళ్ల గ్రామంలో సుమారు రూ.26 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలను సైతం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. అధికారులు పాల్గొన్నారు.

కుళాయిల నుంచి కలుషిత జలాలు

పట్టించుకోని అధికారులు, పాలకులు

ఆకివీడు: మండలంలోని చినకాపవరం గ్రామంలో మంచినీటి సరఫరా అధ్వానమైపోయింది. గత కొన్ని నెలలుగా కుళాయిల ద్వారా ఫిల్టర్ చేయని రా వాటర్ సరఫరా అవుతుంటే, ప్రస్తుత రావాటర్‌కు బదులుగా బురద నీరు, కలుషిత నీరు, మరుగుదొడ్లకు చెందిన ఊట నీరు కలిసిపోయి, సరఫరా అవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో నీరు అడుగంటి పోయింది. ఉన్న నీటిలోకి ఊట నీరు చేరడంతో మరీ అధ్వానంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంచినీటి వ్యవస్థ మెరుగు పరచేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మేజర్ పంచాయతీగా ఉన్న చినకాపవరంకు రామయ్యగూడెం, దండగర్ర, జానకీరామరాజపురం, బంగ్లా దొడ్డి శివారు గ్రామాలున్నాయి. గ్రామంలో సుమారు 5,700 మంది జనాభా ఉన్నారు. మంచినీటి చెరువులు రెండు సుమారు ఆరు ఎకరాల్లో ఉన్నాయి. ఒక చెరువు పూర్తిగా ఎండిపోగా, మరొక పెద్ద చెరువులో కొద్దిపాటి నీరు ఉంది. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా పంచాయతీ, ఆర్ డబ్ల్యుఎస్ అధికారులు ఏవిధమైన చర్యలూ తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మంచినీటి సరఫరాపై పంచాయతీ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శిస్తున్నారు.

చర్మవ్యాధులు ప్రబలుతున్నాయ్

గ్రామంలో కుళాయిల ద్వారా సరఫరా చేసే కలుషిత నీటితో స్నానం చేయడం వల్ల ఒళ్లు దద్దుర్లు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కాళ్లు కడుగుకునేందుకు కూడా పనికిరాకుండా నీరు ఉందని వాపోతున్నారు. బిందెల్లోనూ, టిన్నుల్లో పట్టుకున్నా అవి కూడా పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న ఆర్వో ప్లాంట్ ద్వారా వచ్చే నీటిని,



చినకాపవరంలో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న బురద నీటిని పట్టుకుంటున్న మహిళ

ఇతర గ్రామాలకు వెళ్లి టిన్నులతో నీళ్లు కొనుగోలు చేసి కిలోమీటర్ల కొద్దీ వెళ్లి తెచ్చుకోవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాచి తాగడానికి కూడా పనికిరాని విధంగా కుళాయినీరుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోగాలను సరఫరా చేస్తున్నారు



కుళాయిల ద్వారా మంచి నీరు కాదు, రోగాల నీరు సరఫరా చేస్తున్నారు. ఒకటి రెండు రోజులు కాదు ఏకంగా నెలల తరబడి ఇదే నీరు వస్తుంది. గత కొన్నేళ్లుగా చెరువులోని నీటిని ఫిల్టర్ చేయకుండా సరఫరా చేశారు. ప్రస్తుతం చెరువులోని బురదనీరు, కలుషితనీరు సరఫరా చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

కుర్రెళ్ల నవోమియా,
రామయ్యగూడెం, చినకాపవరం.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం పట్టణం ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ తీగల మార్పిడి కారణంగా ఈనెల 11వ తేదిన కొన్నిప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నరసయ్య అగ్రహారం, కుముదవల్లిరోడ్, పార్క్ వీధి, ఎఫ్‌సిఐ కాలనీ, మార్కెట్ యార్డ్, భాష్యం స్కూల్ రోడ్ తదితర ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఇంజనీర్ వెంకటేశ్వరరావు కోరారు.

వీరవాసరంలో ఎక్సైజ్ దాడులు

వీరవాసరం: మండలంలో కొణితివాడ గ్రామంలో అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ బలరామరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ బలరామరాజు మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు



భక్తాంజనేయస్వామి

యలమంచిలి: జ్యేష్ఠ శుద్ధ చతుర్దశి సందర్భంగా స్థానిక మంచినీటి చెరువు గట్టున ఉన్న శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వాడపల్లి మురళీ కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ఆంజనేయస్వామికి వట్టి వేరు, బంతి, చామంతి పువ్వులతో అభిషేకం, తమలపాకులు, గంగ సింధూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పా ట్లను పర్యవేక్షించారు.

వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

భీమవరం: వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమవరం పట్టణం శ్రీరామపురంలోని గాంధీకస్తూరిబా భవనంలో ఈనెల 12వ తేది నుంచి మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుట్టుశిక్షణతో పాటు ఎంబ్రాయిడరీ ఉచితంగా నేర్పిస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇచ్చే ఈ శిక్షణకు ఆశక్తికలిగిన మహిళలు శిక్షణ పొందవచ్చునన్నారు. ఇతర వివరాల కోసం సెల్: 86397 30222 నంబర్‌కు సంప్రదించాలని ప్రసాదరాజు కోరారు.

సాగు రైతులంతా కౌలు కార్డు పొందాలి

యలమంచిలి: కౌలు వ్యవసాయం చేసే ప్రతి రైతూ ఖచ్చితంగా కౌలు కార్డు పొందాలని మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి సూచించారు. ఇలపకుర్రు గ్రామ సచివాలయంలో మంగళవారం కౌలు రైతు కార్డులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దేవి మాట్లాడుతూ కౌలు కార్డు కోసం సాగుచేసే రైతు తన ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, సొంత రైతు పొలం పాస్ బుక్ జిరాక్స్, తీసుకుని రైతు సేవా కేంద్రంలో ఇన్‌చార్జి వద్దకు వెళ్లి దరఖాస్తు పూర్తి చేసి ఇస్తే కౌలు కార్డు మంజూరు చేస్తారని తెలిపారు.

బాల్య వివాహాలు భవిష్యత్‌కు చేటు

ఉండి: బాల్యవివాహాలు భవిష్యత్‌కు చేటు అని ఉణుదుర్రు సర్పంచ్ పిన్నంరాజు నాగలక్ష్మీ, ఎంపీటీసీ అల్లూరి మాధవి అన్నారు. మంగళవారం మండల శివారు గ్రామం ఉణుదుర్రులో కిశోరబాలికల అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, వ్యక్తిగత పరిశుభ్రత, బాలికలకు విద్యా ప్రాముఖ్యత, పోషకాహారం, బాలల హక్కులు, పోక్సో చట్టం, మంచి చెడు స్పర్శపై అవగాహన, రక్తహీనత వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, నైపుణ్యాభివృద్ధి, సైబర్ నేరాలు, పొదుపు, ఆర్థిక నిర్వహణ, వ్యాయామాలు, క్రీడల ప్రాముఖ్యత వంటి వాటిపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలపై ప్రజా ప్రతినిధులు, గ్రామాధికారులు తప్పకుండా అవగాహన కల్పించడంతో పాటుగా ప్రత్యేక పరిశీలన చేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామాధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

కిషోర వికాసం ముగింపు సభ

పాలకోడేరు: పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ లక్ష్మి మంగళవారం కిషోర వికాసం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలికలతో ఆమె కలసి వేసవికాలంలో ఏ విధమైన జాగ్రత్తలు తీసుకున్నారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, గ్రామ పంచాయతి కార్యదర్శి దేవి, వీఆర్వో, మహిళా సంరక్షణ కార్యదర్శి వాసవి, అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, పద్మ, సరోజినీ, విజయలక్ష్మి, అనంతలక్ష్మి, సీత, ఇందిర, రూత్ మేరీ తదితరులు పాల్గొన్నారు.



ఉణుదుర్రులో కిశోరబాలికల సమావేశంలో అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ



ముగింపు సభలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ డి. శ్రీలక్ష్మి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

వీరవాసరం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పలువురు వక్తలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2025 మే 2 నుంచి జూన్ 6 వరకు ×కిషోరి వికాసం× ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ముగింపు సమావేశాన్ని వీరవాసరం మండలంలో మంగళవారం ప్రతి గ్రామంలో నిర్వహించారు. వీరవాసరం గ్రామంలో జరిగిన ముగింపు సమావేశంలో గ్రామ సర్పంచ్ చికిలే మంగ తాయారు, సీడీపీఓ లక్ష్మీకాంతం, సూపర్‌వైజర్లు సరోజిని, గీత ఎంఎస్‌కె పార్వతి, హెల్త్, వెలుగు ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగరత్నం, సత్యవతి, అన్నపూర్ణ జెస్సీ, భవాని, నాగమణి విజయకుమారి, మంగమ్మ ఝాన్సీ వరలక్ష్మి, నారాయణమ్మ లౌక్య తదితరులు, కిశోర బాలికలు తల్లులు పాల్గొన్నారు. వేసవి శిక్షణా కార్యక్రమాలు ఈ రోజుతో ముగించిన రాబోయే రోజుల్లో కిశోర బాలికలకు స్కూల్స్‌లో కూడా శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని సీడీపీఓ లక్ష్మి కాంతం తెలియజేశారు. సర్పంచ్ చికిలే మంగతాయారు మాట్లాడుతూ నేర్చుకొన్న అంశాలు గురించి కిశోర బాలికల ను ప్రశ్నిస్తూ అందరూ బాగా అవగాహన పెంచుకోవాలని ఆకాంక్షించారు. పెరికి పాలెం, నందమూరి గరువు గ్రామంలో జరిగిన ముగింపు సమావేశంలో సూపర్‌వైజర్ పీబీవీఎల్ సరోజని పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కారం

ఆకివీడు: ప్రజా పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల మేరకు మంగళవారం ఆయా ప్రాంతాలకు వెళ్లి కొన్ని సమస్యల్ని తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వంటపాటి ఆంజనేయులు పరిష్కరించారు. మండలంలోని చినకాపవరం శివారు రామయ్య గూడెంలో దారి సమస్యను ఆ ప్రాంత లబ్ధిదారులతో మాట్లాడారు. ఇరవైఏళ్ల క్రితం పేదలకు ఇచ్చిన పట్టా భూముల్లో దారి లేదని అడ్డగించిన వ్యక్తితో మాట్లాడి పట్టా భూములు పేదలకు ప్రభుత్వం ఇచ్చిందని, దారి లేదని అడ్డుపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే చేయించి రెండు గజాల నడక దారిని ఎమ్మార్వో, ఆర్ఐలు కల్పించారు. దీంతో ఆ ప్రాంత లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. చినకాపవరంలోని పెదకాపవరం వెళ్లే రహదారి వెంబడి పంట బోదెను పూడ్చివేసి నడక మార్గం ఏర్పరుచుకున్నారని, బోదెకు తూములు ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత స్థలదారుడు ఫిర్యాదు చేయడంతో బోదె ప్రాంతాన్ని పరిశీలించి, తూములు ఏర్పరుచుకోవాలని లేకుంటే బోదే ఆక్రమణల్ని తొలగించి, తవ్విస్తామని హెచ్చరించడంతో తూములు ఏర్పాటుకు ఆక్రమణదారుడు అంగీకరించారు. స్థానిక సమతానగర్‌లో స్థల వివాదంపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ, ఎమ్మార్వో, ఆర్ఐలు ఆ ప్రాంతానికి వెళ్లి సమస్యను పరిశీలించారు.



రామయ్యగూడెంలో దారి సమస్యను పరిష్కరించిన తహసీల్దార్ వెంకటేశ్వరరావు

యోగాతో మెరుగైన ఆరోగ్యం

భీమవరం: యోగాతో మెరుగైన ఆరోగ్యం సాధ్యపడుతుందని పలువురు వక్తలు తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం పట్టణంలోని సిగ్ని స్కూల్లో యోగా శిక్షణ తరగతులు మంగళవారం ముగిసాయి. రవిశంకర్ గురూజీ స్థాపించిన ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సభ్యుడు కలిగొట్ల గోపాలశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న మహిళలు యోగాసనాలు, ధ్యానం వంటి అంశాలపై శిక్షణ, పలు ఆరోగ్య సూత్రాలపై అవగాహన పెంపొందించుకున్నారు. ఈసందర్భంగా గోపాలశర్మ, స్కూల్ డైరెక్టర్ హరిసింగ్, ప్రిన్సిపల్ జ్యోతిసింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవన శైలిలో సేవ, సాధన అనే అంశాలపై ప్రధాన లక్ష్యాలుగా పయనించాలని తద్వారా ఆధ్యాత్మిక భావాలతో శాంతి జీవనానికి అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, హేమ, దివ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీలను విజయవంతం చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాస్థాయి యోగా పోటీలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. యోగాంధ్ర 2025లో భాగంగా యోగా ప్రదర్శనలు, పోటీలు, యోగా అభ్యాసం పట్ల ప్రజలలో అవగాహన పెంచేందుకు జిల్లా వ్యాప్తంగా అనేక యోగ కార్యక్రమాలను, ర్యాలీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ, మండల స్థాయిలలో నిర్వహించిన యోగ పోటీలలో గెలుపొందిన వారికి భీమవరం పట్టణం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం నందు జూన్ 10 నుంచి మూడు రోజులు పాటు జిల్లాస్థాయి యోగ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు తదుపరి రాష్ట్రస్థాయికి వెళతారని ఆమె తెలిపారు.



భీమవరంలో యోగా సాధన చేస్తున్న మహిళలు

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి

కాళ్ల: ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును పశ్చిమగోదావరి జిల్లా ఆక్వా రైతులు కోరారు. కాళ్ల మండలం పెదఅమీరంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పలువురు రైతులు మాట్లాడుతూ ఇటీవల ।అమెరికా యాంటీ డంపింగ్ డ్యూటీ।ని పెంచడంతో రొయ్యల అన్ని కౌంట్ల ధరలు రూ.10 తగ్గించారని, ఈ భారం రైతులపై పడకుండా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రూ.1.50 పైసలు విద్యుత్ సబ్సిడీని వెంటనే అమలు చేయాలని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టుకున్న వారికి కూడా సబ్సిడీ వర్తింపజేయాలని కోరారు. వీటితో పాటు మేతల ధరలు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. వీటన్నింటిపై విజయవాడలో జరిగే కమిషనర్ ఆఫీస్ మీటింగ్ లో చర్చించి తదుపరి ముఖ్యమంత్రితో కూడా మాట్లాడి ఆక్వా రైతులు సమస్యలు పరిష్కరించేలా చూస్తానని రఘురామకృష్ణంరాజు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్.గజపతిరాజు, జీవి సుబ్బరాజు, తులసి రాంబాబు, వీరవల్లి చంద్రశేఖర్, ఆకివీడుకి చెందిన పలువురు ఆక్వా రైతులు పాల్గొన్నారు.



ఆక్వా రైతులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

ముగిసిన శ్రీకుంతీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు

యలమంచిలి: కొంతేరు గ్రామంలోని శ్రీకుంతీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో వైకానస ఆగమ ప్రకారం శుక్రవారం నుంచి ప్రారంభమైన స్వామివారి కల్యాణోత్సవాలు మంగళవారం ముగిశాయి. అర్చకులు పూలపల్లి వేణునాథ్ బ్రహ్మత్వంలో పండితులు పొలమూరు మాధవ చార్యులు ఉదయం స్వామికి పూర్ణాహుతి, చక్రస్నానం, పంచామృతాభిషేకం మధ్యాహ్నం పల్లకీపై స్వామి గ్రామోత్సవం, రాత్రి పుష్ప యాగం కనుల పండుగగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులందరికీ తీర్థ ప్రసాద వితరణ చేశారు. మహిళ భక్తులకు అమ్మవారికి పూజ చేసిన పసుపు, కుంకుమ, గాజులు ప్రసాదంగా అందజేశారు. పుష్పయాగం తరువాత ఆలయం వద్ద భక్తులు చేసిన కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



లక్ష్మీ నరసింహస్వామి వారికి అభిషేకం చేస్తున్న అర్చకులు



కొంతేరులో చక్రస్నానం అనంతరం స్వామి వారి పల్లకీ సేవ

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

నరసాపురం రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి మంగళవారం నరసాపురం మండలం ఎల్బీచెర్ల, తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. క్యాన్సర్ తదితర రోగ నిర్ధారణ (ఎన్‌సీడీసీడీ) పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే తీరు, ఆన్ లైన్ రికార్డులను పరిశీలించారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి ఓపీ రికార్డులను పరిశీలించారు.

సాగులో పాముల భయం

- పెనుగొండ మండలంలో కార్మికులకు పాము కాట్లు
- వ్యవసాయ పనులకు వచ్చేందుకు హడలిపోతున్న వైనం

పెనుగొండ: మృగశిర కార్తే ప్రారంభం కావడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో పాములు వ్యవసాయ కార్మికులను భయపెడుతున్నాయి. గత ఏడాది వరుస పాము కాట్లతో కార్మికులు ఇబ్బందులు పడడంతో ప్రస్తుతం వ్యవసాయ పనులు చేయడానికి హడలెత్తిపోతున్నారు. పెనుగొండ మండలంలో ఇటీవల పాము కాటుకు పలువురు బెంగాలీ కార్మికులు గురయ్యారు. ముఖ్యంగా రక్త పింజరిలు పెరిగిపోవడంతో వ్యవసాయ పనులకు వచ్చే కార్మికులను కాటు వేస్తున్నాయి. వరి నాట్లు వేయడానికి పశ్చిమబెంగాల్ నుంచి కార్మికులను అధిక సంఖ్యలో ఆచంట నియోజకవర్గానికి తీసుకొస్తుంటారు. వీరో ఒక్కో బంటాకు 20 నుంచి 30 మంది కార్మికులు ఉంటారు. వీరు వరినాట్లు పూర్తి చేసిన అనంతరం వరి చేలవద్దే ఏర్పాటు చేసిన మకాంలలో విశ్రాంతి తీసుకొంటారు. వీరు పాము కాటుకు గురవుతున్నారు. వీరితో పాటు పలువురు రైతులూ పాము కాటుకు గురవుతున్నారు. వడలిలో ఇటీవల ఓ బెంగాలీ కార్మికుడిని పాము కాటు వేయడం వైద్యం అందిలోపునే మృతి చెందాడు. దేవలో ఉపాధి హామీ పథకంలో ఉపాధి పనుల్లో భాగంగా పంట కాలువలు బాగు చేస్తుండగా మహిళా కార్మికురాలు పాముకాటుకు గురైంది. ఇలా సుమారు 20 నుంచి 30 మంది వరకు పాము కాటుకు గురైనా సకాలంలో వైద్యం చేయించుకోవడంతో బతికి బట్టకట్టారు. పెనుగొండ శివారు చిన్నంవారి పాలెం, వడలి ప్రాంతాల్లో పలువురు రైతులు పాము కాటుకు గురయ్యారు. పాము కాటు గుర్తించిన వారు సకాలంలో వైద్యం తీసుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఆలశ్యం చేసిన వారు పెనుగొండ, సిద్ధాంతం ఆసుపత్రిల నుంచి తణుకు, ఏలూరు ప్రభుత్వాసుపత్రిల వరకు వైద్యం కోసం వెళ్లాల్సి వస్తుంది. వర్షాకాలంలో పాముల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వర్షాలు పడితే పాములు వస్తాయంటూ రైతులు, కార్మికులు హడలెత్తిపోతున్నారు.



పెనుగొండ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న బెంగాలీ కార్మికుడు



రక్త పింజరి పాము

బెంగాలీ కార్మికులకూ బీమా చేయాలి



జీవనోపాధికోసం వచ్చి పాము కాటుకు గురవుతున్నారు. దీంతో వారి కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. బెంగాలీ కార్మికులను తీసుకొచ్చే వారు కార్మికులకు బీమా చేయించాలి. ప్రభుత్వాసుపత్రుల్లో పాము కాటు మందు సిద్ధంగా ఉంచాలి. ప్రాణాపాయం కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఎస్ వెంకటేశ్వరరావు, సీఐటీయూ